అరవయ్యోపడిలో
పడిన ఆమెకు
భర్త యిచ్చిన
అపురూప కానుక?

# శ్రీమతికి బహుమతి

## ఇచ్ఛాపురపు రామచంద్రం కథ

ఆరుబయట... పారిజాతం చెట్టు పక్కన... మడతమంచంమీద మేనువాల్చి... కనులు మూసుకున్నా — దయానిధికి నిద్ర రావడం లేదు.

ఎలా వస్తుంది? ఆవిడ రాలేదుగా? అలవాట్లు ఒకరెతట పోవు. కనీసం కొన్ని.

'నీవురావు... నిదురరాదు...' దూరం నుండి పెళ్లిమైకులోంచి కాబోలు — పాట చక్కని చిలిపితనాల మూట. ఈ సినీ కవులు అఖండులు. ఎలాంటి విషయాన్నయినా సభ్యంగా సుందరంగా కొంటెగా కవిత్వ మల్లగల చతురులు.

ఔనూ — పెళ్లికి మైకులెందుకో? ఒకరిమాట ఒకరికి వినపడకుండా... తన పెళ్లికి మైకులు లేవు. ఐనా... పెళ్లంటేనే సందడి. మళ్లీ ఈ గోల దేనికీ? 'ఆనందం అర్ణవమైతే... అనురాగం అంబరమైతే...' తనకెంతో నచ్చే పాట. అర్ణవం అన్న పదం తనకెంతో ఇష్టం. అర్ణవం... అంబరం... ఇక నిదుర ఎలాగూ వచ్చేటట్లు లేదని — కళ్లు తెరిచేశాడు.

ఆకాశం... విశాలంగా పరచిన తెలినీలపు తెరలా వుంది — అక్కడక్కడ తెల్లటి మబ్బు తెరలున్నా... చందమామ వృత్తలేఖినితో గీయబడినట్లు గుండ్రంగా వున్నాడు — పున్నమని కాబోలు. కృష్ణుడు వెన్న రాసుకున్నాడని తానేమో జున్ను పులుముకున్నాడా అన్నట్లు గోధుమరంగు దాల్చాడు.

అర్ణవం — అంతులేని లోతయితే, ఆకాశం అందనంత ఎత్తు. సాగరంలో మేలిమి ముత్యాల మిలమిలలూ, గగనంలో నక్షత్రాల మిణుకుమిణుకులూ అంబుధి



ఆకాశమూ రెండూ విశాలాలే. అనంతాలే. సాగర గగనాలు రెండూ ఆలోచనాస్ఫోరకాలే భావుకులకే రచయితలకే.

వేసవి వెన్నెల — మల్లెపూవులా వుంది. చక్కగానూ, చల్లగానూ మనోహరంగానూ వుంది వాతావరణం. రాత్రి ముదురుతోంటే చంద్రుడు తెల్లనౌతూ వెన్నెల చిక్కబడుతోంది.

ఏ పక్షిపిల్లో కొత్తగా నేర్చుకుంటుందేమో — పక్షికూత — వేళకాని వేళ!

దయానిధి ఉలిక్కిపడ్డాడు.

జపం విడిచి లొట్టల్లో పడ్డట్లు — ఆవిడకోసం ఎదురుచూస్తూ ఆలోచనలలో పడిపోయాడా ఆకాశం చూస్తూ! ఎంతసేప టినుంచి?

అతను ఆలోచనాలోకంనుంచి ఇహలోక ంలోకి వచ్చి, మంచంమీదే పక్కకు తిరిగి చూశాడు. అవంతి — చాపమీద!

వెన్నెల పదుతో... ఆమె నొసటిమీద — మెరుస్తున్న స్వేదముత్యాలు. అది కేవలమూ చెమట బిందువులు మాత్రమే కావు. పగటి చాకిరీకి ప్రతిరూపాలు. కనులు మూసుకుని పదుకున్నాక కూడా వదలనంత విపరీత శ్రమాచిహ్నాలు.

ఆమె ముఖం — వాడిపోయి... వడలిపో యి... కారణం... కొంతమేరకే వయోధర్మ ం. ఎక్కువ మేరకు అవిశ్రాంత శ్రమవలన నే.

అతనికి బాధేసింది. హృదయం ఆర్ద్రమ యింది. అవంతి పెళ్లికెలా వుండేది! ఎంత అందంగా వుండేది! ఆమె అందంచూసి అప్రతిభుడైపోయి పెళ్లిచూపులలోనే అక్క డికక్కడే అప్పటికప్పుడే ఆలస్యం కాకుండా ఆమె తన అర్ధాంగైపోతే ఎంత బాగుండునూ అని వివేకం మరచి వెర్రివాడైపోయాడు తను. అంతటి అందగత్తె ఇప్పుడెలా వుంది!

సంవత్సరాల తరబడి... దశాబ్దాల తరబ డి... జైలుగదిలాంటి వంటింట్లో...వేడిముం దు మాడుతూ మగ్గుతూ వాడుతూ... అవిశ్రాంత శ్రమలో... విరామ రహిత చాకిరిలో పడి నలిగి నలిగిన మనిషి — ఇలా కాక మరెలా ఔతుంది. మొదట ఎంత సుందరైనా? ఆమె స్త్రీ కనుకనేనా ఇంత కఠిన శిక్ష?

ప్రపంచంలో అత్యధికంగానూ అతి దారుణంగానూ దోచుకోబడేది స్త్రీ! ఆమెన లా దోచుకునేవారు పురుషులూ సాటిస్త్రీలు కూడా! ఆపైన — ప్రకృతికూడా ఆమెపాలి ట పరమ శత్రువే. సృష్టిభారమే ఆమెమీద వేసింది. నవమాసాల మోత... ప్రసవవేదన ... పిల్లల పెంపకం — ఓ మహాయజ్ఞమే. జీవితంలోని అధికభాగాన్ని తినేసే బాధ్యత. ఇక్కడికి చాలనట్లు ఇంటిపనులు, వంటపను లు... ఇస్త్రీ పనులు... బజారుపనులు... ఎన్నో ఇంకెన్నో. సుకుమారి అయిన ఆమె ఇంత శ్రమకోర్వగలదా అన్న ఆలోచనే వుండదు.

ఇంటిలో మొట్టమొదట లేచేది గృహిణే. చిట్టచివరకు పడుకునేదీ ఆమే. అందరకూ వడ్డించిన తరువాత అడుగున మిగిలినవి తినేదామే. మిగలకపోతే పస్తుండేదీ ఇల్లాలే.

స్త్రీ ఎంత దయనీయ!

అతని హృదయం ఆర్ద్రమయింది.

మంచం దిగి... దగ్గరగా నిలుచుని ఆమెనే చూడసాగాడు కొత్తగా. చాపమీద అవంతి! ఇదొక బాధ! ఎంత చెప్పినా వినదు. ఆమె చాప పరుచుకుని వుండగా తాను మంచంమీద హాయిగా పడుకుందుకు తనకి మనసొప్పదు. అలా చెప్పినా వినిపించుకోదు. పైగా అదే తన స్థానమంటుంది. అలాగే తన సుఖమంటుంది. ఏమిటో? పడుతున్న శ్ర మంతా చాలనట్లు ఈ శిక్షకూడా ఎందుకూ

తనకి తానే విధించుకోవడం?

ఇవాళ?

మనవడి జన్మదినమని కోడి కూయకముందే లేచిపోయింది. అప్పటినుంచీ పిండివంటలూ వంటలూ ఒకటే చాకిరీ. కోడలేమో సీతాకోకచిలుకలా అలంకరించుకుని పార్టీ... అతిథులూ... అంటూ షోకు తిరుగుళ్లు. ఈవిడ — ఇదుగో... ఇంతవేళయ్యాక పడక చేరింది. ఎందుకు శ్రమపడాలి అవంతి తలకు మించి? కష్టం కొంత కోడలికి పంచొచ్చుగా? ఊర్లో పెళ్లి కుక్కలకి హడావిడీ అన్నది నీ చోపమే ఐనా మనవడి జన్మదినానికి మామ్మగారెందుకూ గుండాపిండీ ఐపోవడం? వొట్టి అమాయకురాలు. సుఖపడనేర్వనిది. భగవంతుడే కాపాడాలి.

అలసట... చెమట ముత్యాలు... ఐనా అదో అందంగా..

అతను జాలిగానూ, ప్రేమగానూ ఆ చెమటనద్దాడు. శిరసు నిమిరాడు.

ఆ స్పర్శకేమో—

కళ్లు తెరిచిందామె. కంగారుపడింది. "మీరింకా పడుకోలేదూ?" తామూ లేచి కూర్చుంది. అతనికి కొంచెం కోపమొచ్చింది. "నేను పడుకోకపోతే నువ్వెందుకూ లేచిపోడం?"

ఆ ప్రశ్న వినిపించుకోనట్టే అడిగిందవంతి. "మంచినీళ్లు కావాలా?"

నాకు దాహంగా ఏమీ లేదు."

"తలనొప్పా? అమృతాంజనం మర్దన చేసేదా?"

అబ్బా! మూలిగిందతని మనసు. ఓ స్త్రీ! నీకింత ఓపికెక్కడినుంచి వస్తుంది?

"తలనొప్పి కాదా? కాళ్ల పీకులా? వంశీ పుట్టినరోజే అయినా మీరటూ ఇటూ తిరిగి తెగ అలసిపోయారు. వొద్దన్నా వినరాయె. పడుకోండి, పాదసేవ చేస్తాను"


తల బద్దలు కొట్టేసుకోవాలనుకున్నాడతను. అవంతి ఎంత స్త్రీ అయినా, భర్తంటే ఎంత ప్రేమయినా... మరీ ఇంత ఇదా! ఎంతసేపూ ఎదుటి మనిషి గురించే తప్ప

## గుండె

"మన భాస్కర్ ఈ మధ్య చూసిన ఆకులల్లా నములుతున్నాడు ఏమిటీ సంగతి" అడిగాడు నాగేంద్ర.

"ఓ నువ్వీమధ్య ఊళ్లో లేవుగదూ. వాడికి గుండె ఆపరేషన్ అయింది. మేక గుండె వేశారు" చెప్పాడు నరేంద్ర.

—శ్రీకొండ (ఎర్రబోదు)



తన సంగతి తాను కొంచెమైనా చూసుకోదే ం? పగలంతా రెక్కలు ముక్కలు చేసుకుని వాళ్లంతా ముద్దుగా పడుకున్న తానేమో నిద్ర చెడగొట్టుకుని గుండ్రాయిలా వున్న భర్తగాడికి పాదసేవలూ పవళింపు సేవలూ చేయడానికి సిద్ధమవుతుందా — నిద్ర పాడుచేసినందుకు గెటౌట్ అనకుండా! మంచితనానికైనా... త్యాగాలకైనా... పతిభక్తి కైనా ఓ హద్దూ పద్దూ అర్థమూ పర్థమూ వుండొద్దూ? ఉదయంనుంచీ వాళ్లు హూన ం చేసుకున్నదేమో తనా? కాళ్లు పట్టించుకు నేదేమో నేనా! ఏమిటామె ఉద్దేశం? తనేమై నా ఆర్ద్రతా హృదయమూ లేని రాక్షసుడను కుంటుందా? ఎదుటి మనిషి పరిస్థితికి స్పందించలేని బండవాడనుకుంటుందా?

"చూడవంతీ! నేనూ మనిషినే. శిలను కాను. కష్టమూ సుఖమూ గమనించలేని కఠినాత్ముడిని కాను. నీకు నామీదున్నంత ప్రేమ నాకు నీమీద లేదని నువ్వనుకుంటు న్నావేమో? కాని నాకూ మనసుంది. జాలీ ధర్మమూ ప్రేమా అనురాగమూ వున్నాయి —" ఉద్వేగంగా అన్నాడు. ఆమె అయోమ యంగా చూస్తూ — "బి.పి మాత్ర తెచ్చేదా?" అడిగింది.

"నాకు బి.పి రాలేదు" మొండిగా వుందతని కంఠం.

"నిద్రమాత్ర?"

"అవంతీ!" చికాకు పట్టలేకపోయాడు. "అలాటి ఆరాలాపెయ్. ఎంతసేపూ నా అవసరాలూ, నా ఆనందమూ, నా క్షేమ మూ, నా భద్రతా, నా సుఖమూ, నా జీవితమూ అంతేనా? నీగురించి చూసుకునే దేమీ లేదా?" ప్రేమగా కోప్పడ్డాడు. కంఠ మెంత కరుకుగా వున్నా దానిలో అంతర్లీనం గా ప్రవహిస్తున్న అనురాగానికామె ఆనందప డిపోయి —

"నాగురించి నేనెందుకూ చూసుకోడం ? భగవంతుడూ భర్త మీరున్నారుగా?" నవ్వేసింది.

"ఐతే నేను చెప్పినట్లు వింటావా?"

"విననిదెప్పుడూ? ఏదీ?"

"అదికాదు —" ఏదో అనబోయాడు దయానిధి.

"అర్ధరాత్రి అంకమ్మ శివాలనీ ఇప్పుడవ న్నీ దేనికి కానీ కళ్లు మూసుకు పడుకోండి. ఇప్పటికే చాలా వేళయింది. వేళపట్టున నిద్రపోకపోతే అసలే మీ ఆరోగ్యం మంచిది కాదు" మళ్లీ తనగురించే తపన! ఏమిటీమె? ఆడవాళ్లంతా ఇంతేనా? లేక... అవంతి ఎక్కడినుంచయినా ప్రత్యేకంగా ఊడిపడిం దా?

"రెండువేపులా దహించుకుపోతూ తన వారికి వెలుగునిచ్చే కొవ్వొత్తి కావడం నీకు సరదాయే ఏమోకాని — అలాంటి త్యాగాలు భరించడం మాత్రం నాకు దుర్భరం —" నిష్ఠురంగా వుంది కంఠం.

"నిద్రపోండీ..." వేడుకుంటున్నట్లే అ ంది అవంతి.

"నాకు నిద్రరాదు. నువ్వు పడుకో..." లేచి వెళ్లబోయాడు.

"మీరు నిద్రపోకుండా నేనెలా పడుకునే దీ?" అమాయకంగా చూసి... "ఐనా ఎందుకురాదూ మీకు నిద్ర? వేళైనా తక్కువయిందా?" అడిగింది.

"ఆలోచనలు —" అన్నాడతను ముక్తసరిగా... ఆమె ప్రేమకు కోపం పెరిగిపోతుంటే.

అవంతి పాతకాలపుదే కావచ్చు... పత్నిపతే కావచ్చు. కాని కట్టుకున్నవాడికి మరీ ఇంత నీడగా మారిపోవాలా తన సుఖదుఃఖాలనుకూడా విస్మరించేంత?

"దేనిగురించి? ఇప్పుడేమొచ్చిందని?" గొంతులో భయం.

"నీగురించే..."

విస్మయంగా చూసింది. "నాగురించేముందీ తలబద్దలు కొట్టుకుని ఆలోచించడానికి?"

"నువ్వు గమనించలేదు నీ పనిలోపడి... కాని ఇవాళంతా నేను నిన్ను చూస్తూనే వున్నాను. ఎంత శ్రమపడ్డావూ వొంటిచేత్తో వంటలన్నీ చేసి!" మాటలనిండా మమతా ప్రేమా.

"ఆడదానికి వంట శ్రమేమిటండీ?" విస్నపిల్లవాడిని చూసినట్లే చూసింది. అమాయకుడినిలా చూసింది చిరునవ్వుతో.

ఏం మనిషి! ఈమె మనిషేనా లేక విశ్రాంతి అవసరం లేని మరా?

"నేను — ఎల్లుండి గురించి ఆలోచిస్తున్నాను"

"ఏముంది ఎల్లుండి ప్రత్యేకత?"

దెబ్బతిన్నట్లు చూశాడు దయానిధి. "ఎల్లుండికి ప్రత్యేకతేమీ లేదూ?" రెట్టించాడు.

"ఏమో బాబూ... నాకేమీ తట్టడంలేదు" తేలికగా అనేసింది.

"జాగ్రత్తగా ఆలోచించు..."

"ఏమో... ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా నాకు తట్టడంలేదు —"

"భగవంతుడా! ఎల్లుండి — పుట్టినరోజు!"

"బాగుంది!... కిందటినెలలోనే ఐపోయింది మీ పుట్టినరోజు. మరచిపోయారా?"

"మరపు నాకు కాదు, నీకు. ఎల్లుండి పుట్టినరోజు నాదికాదు, నీది!"

# శిశుమరణాలు



ప్రపంచంలో నిరుపేద పిల్లలో ఒక్కొక్కడి కింద 100 డాలర్లు దాదాపు 900 రూపాయలు ఖర్చుపెట్టి వుంటే 1981లో 1.7 కోట్ల శిశుమరణాలను నివారించడానికి వీలై వుండేది. 1982లో పుట్టిన పిల్లలో కూడా ఏడాది నిండేలోగా 1.2 కోట్లమందే, 5 ఏళ్లు వచ్చేలోగా 50 లక్షల మంది శిశువులు మరణించడం జరగవచ్చు. ప్రపంచం చేస్తున్న సైనిక వ్యయంలో అరువారాం ఖర్చుపెడితే ఈ శిశుమరణాలు నివారించవచ్చు.

—డి.పార్వతీదేవి

"ఎల్లుండి న పుట్టినరోజా! మీరు గుర్తుపెట్టుకున్నారా! దానిగురించే ఐతే ఆలోచించడానికేముందీ? ఐనా అరవయ్యో ఏట అగ్గి గండమన్నట్లు నాకింకా పుట్టినరోజులూ, బాలసారెలూ ఏమిటి?"

"మరి — నా పుట్టినరోజుకెందుకూ అంత హడావిడి చేశావ్? తలంటు... కొత్త బట్టలు... సేమ్యా పాయసం... వడలు... ఎంత వద్దన్నా వదిలేవా?"

"మీరంటే మగవారు!"

భారంగా నిట్టూర్చాడాయన. మానవులంతా ఒకటే సృష్టి. ఆ సృష్టిని కొనసాగించడం దేందుకని స్త్రీ పురుష లింగభేదం కల్పించబడినా స్త్రీపురుషులిద్దరూ మౌలికంగా మానవులే. ఈ ప్రాథమిక సత్యాన్ని గమనించకుండా అవంతి స్త్రీ అయిన తనను తాను అల్పంగా చూసుకుంటూ మగవాడైన తనను అందలం ఎక్కిస్తోంది! ఎందుకని స్త్రీ ఇంత ఆత్మన్యూనతాభావాని కలవాటుపడిపోయింది? తాను మగవాడికంటే తక్కువనే భావాన్ని నరనరాల్లో ఎందుకు జీర్ణింపజేసుకుంది? ఇందుకు కారకుడు పురుషుడేనా? అదే ఐతే మగాడు యుగయుగాలుగా తరతరాలుగా తాను స్త్రీపట్ల ప్రదర్శిస్తూ వచ్చిన ప్రవర్తనలోని అమానుషత్వానికే, అన్యాయానికే సిగ్గుతో ఎంత తలవంచుకోవాలి!

"నువ్వంటే — స్త్రీవి!" గొప్ప చేస్తున్నట్లన్నాడు.

మతిపోలేదుకదా ఈ మనిషికన్నట్లు చూసింది. అందుకు రోషమొచ్చిన దయానిధి, మనసులో నీకర్థంకాదులే అనేసుకుని —

"నీ పుట్టినరోజుకి ఒక అద్భుతమైన కానుక ఇవ్వాలనుకుంటున్నాను" ఊరిస్తున్నట్లన్నాడు.

"ఏమిటి?" కానుకలన్నా బహుమతులన్నా ఎవరికైనా ఏ వయసువారికైనా సరదాయే.

"ఊహించు చూద్దాం..."

"పెళ్ళిళ్ళకి, పెద్ద పండగలకీ పేటలమీదకి కొంటూనే వున్నావుకదా, కొత్తేముందీ?" అన్నాడు, మనసులో — నీ చీరలపిచ్చి దొంగలుతోలా! ఎన్ని చీరెలున్నా చాలవూ? అచ్చం ఆడదానివనిపించుకున్నావుకదే... అని విసుక్కుంటూ.

"నగ ఏదైనానా? గాజులు చేయిస్తారా బంగారంవి?"

ఓసి నీ తెలివి బంగారంగానూ! నీ వొళ్లే బంగారం. నీకింకా నగలెందుకే? నగల వ్యామోహం నీకెప్పటికి పోతుందో? అని లోపల చికాకు పడుతూ—

"అపురూపమైన కానుకంటున్నానుగా?—" అన్నాడు ఇంకా ఆలోచించమన్నట్లు.

ఆమె ఆలోచనలో పడింది.

ఏమయ్యుంటుందీయనియ్యబోయే బహుమతి? అరవై ఏళ్లు వచ్చాయన్నమాటేకాని ఈయనింకా బాలాకుమారులూ, వొట్టి చిలిపే.

ఆ మధ్య — శ్రావణమంగళవారానికో వరలక్ష్మీ వ్రతానికో — పసుపు నలుచుకుని తలంటుకుని పట్టుచీర కట్టుకుని... తలనిండా పూలూ, నుదుటనిండా బొట్టూ పెట్టుకుని — పాదాలకు నమస్కరిద్దామని వొంగబోతుంటే — అలాగే రెండు చేతులా

పాదివి పట్టుకుని... చటుక్కున కౌగిలించుకుని... బుగ్గమీద ముద్దు పెట్టేసుకున్నారు! చిటికెలో చేసేశారు చిలిపిపని! పైగా — ఘనకార్యం చేసినట్లు గడుసు నవ్వొకటి! అంటారూ "నిన్ను చూస్తుంటే పెళ్లిరోజు గుర్తుకొచ్చి... ఒక్కసారి ప్రేమ వరదలై పొంగి కట్టతెంచుకుంది. నేనేంచేయనూ?"

నయమే. కోడలు చూడలేదుకానీ... చూస్తే ఏమౌనూ? షష్టిపూర్తిచేసుకున్న ఆయనా... దగ్గరవుతున్న తనూ... ఈ వయసులో... పట్టపగలు... అలా... ఎంత దంపతులైనా ఏం. ఏమనుకుంటారూ ఎవరి కంటయినా పడితే?


నిజం చెప్పొద్దూ... తనకి బాగానే వుందా సరసం. మూలనపడిన వీణ మళ్లీ తీగెలు సవరించబడి రాగాలాలపించబడినట్లు. కాని... ఎంత భర్తయినా పట్టపగలు అంత బరితెగింపా? బాగుంటుందా? లోకం హర్షిస్తుందా? అని ఆలోచించొద్దూ? పదిమందికి చెప్పవలసిన వయసుకాని ఒకరిచేత చెప్పించుకోవలసిన వయసుకాదే! హవ్వ! ముందూ వెనుకా చూడకుండా ఎంత కొంటెతనం! ఇంకో నిమిషం అక్కడ నిలబడితే ఇంకెక్కడికి తీసుకువెళ్తారో అని భయమేసి, పాదాభివందనమూ వరలక్ష్మి వ్రతం పాదపూజా అన్నీ మరచి లోపలికి వెళ్లిపోయింది.

కొంపతీసి అలాంటి కానుక కాదుకదా?

ఏ తియ్యని ముద్దో కమ్మని కౌగిలో కాదుకదా?

ఏదో. ఎంతకైనా తగినవారే. ఆయనకేం, మగమహారాజు. ఏమయినా చెయ్యగలరు. అలాటి కానుకలూ బహుమతులూ ఐతే నలుగురిలోనూ వొద్దండీ అని బతిమాలుకుని దణ్ణం పెట్టేయాలి. మెల్లగా అడిగింది వినపడీ వినపడకుండా. "ప్రేమగా ఓ ముద్దు కాదుకద మీరివ్వబోయే కానుక?"

"అవి అప్పుడప్పుడూ ఇస్తూనే వున్నానుగా? నిజంగా అవి అపురూపాలే... అందమైన బహుమతులే. కాని నేనివ్వబోయేది అపూర్వమని చెప్పలేంగా అనలేనుగాని నా



కూ నీకూ తెలిసిన మేరకు మన కుటుంబాల లో ఏ భర్తా భార్యకివ్వనిదే అనుకుంటున్నా ను'' ఊరిస్తున్నట్లే అన్నాడు.

ఊహించు చూద్దాం అని కవ్విస్తున్నట్లే చూశాడు.

ఏమిటబ్బా అంత అద్వితీయమూ అపురూపమూ ఐన కానుక?

''తాజ్‌మహల్ కాదుకదా?'' నోరుజారింది.

''నీమీద నాకెంత ప్రేమున్నా నేను మధ్యతరగతి మనిషినేతప్ప షాజహానులా చక్రవర్తిని కాను మరో తాజ్‌మహల్ కట్టించడానికి. అదీకాక... నా ఉద్దేశమేమిటంటే తాజ్‌మహల్‌లాటివి చరిత్రలో నిలిచిపోవడానికి తప్ప నిజజీవితానికంతగా పనికిరావు. నా ఆలోచనలలాగ సాగవు. సాగలేదు. నీకివ్వాలనుకున్న బహుమతి నిన్నో మొన్ననో అనుకున్నదికాదు. ఎన్నాళ్లనుంచో ఆలోచిస్తున్నది. నిజానికి ఎన్నేళ్లనుంచో అని చెప్పాలి''

ఆమె ఆశ్చర్యపోయింది.

భర్తకు తనమీద చాలా ప్రేమని తెలుసు కానీ తనకివ్వబోయే కానుక గురించి ఏళ్ల తరబడి ఆలోచన చేశారా! ఐతే అది ఖచ్చితంగా సామాన్యమైనదై వుండదు. తాను చెప్పినవేవీ కాకపోతే ఏ బదరీనాథ్‌కో హృషీకేశ్‌కో, హరిద్వారానికో తీర్థయాత్ర తీసుకువెళ్తారేమో అనుకుంది. ఈయన మాటలనుబట్టి చూస్తే అది కాదనే అనిపిస్తోంది.

ఈయనెప్పుడూ ఇంతే. ఎప్పుడేం చేస్తారో ఎవరికీ తెలియదు. ఇన్నేళ్లనుంచీ కాపురం చేస్తున్న తనకే అంతుపట్టదు ఆయన అంతరంగం.

మొన్నటికి మొన్న... ఆ వేళెందుకో ఇంట్లో పని ఎక్కువగా వుంది. ఎందుకో ఏమిటి? ఆవకాయ పెట్టడం... ఆపైన ఎవరో అతిథులు వస్తారన్నాడు అబ్బాయి. అందుకని వంటలూ, పిండివంటలూ కూడా ఎక్కువే చేయవలసి వచ్చి తడిసి మోపెడైంది. తను అంత కష్టపడడం చూడలేకపోయారో ఏమో ''అంతపనీ నువ్వే చెయ్యకపోతే కొంత కోడలికివ్వకూడదూ?'' అనేశారు వెనుకాముందూ ఆలోచించకుండా. ఆయనకేం ఒక్క మాటనేసి ఊరుకున్నారు. ఆయన వెనుక ఎంత రాద్ధాంతం జరిగిందో ఆయనకేం తెలుసూ?

''ముసలాళ్లకి పెళ్లామంటే ముద్దే! వొంటిమీద రంగ వాలనీయరు. తన భార్య కష్టపడకూడదు. కోడలు . దొరికిందికదా తేరగా?'' అంటూ మూతి మూడు వంకర్లు తిప్పుతూనే వుంది రోజంతా. చెప్పుకుంటే సిగ్గుచేటూ కొంపకంపూ.

''చెప్పరూ?'' బతిమాలుతూ అడిగింది .

''చెప్పను. చేసి చూపిస్తాను. మొద్దువు గాని. ఎల్లుండివరకూ ఎదురుచూడు'' నవ్వాడు.

''నాకునిద్రపట్టొద్దా? పడుకున్నదానిని లేపి మెదడులో పురుగుని పడేశారు...''

''మహ బాగా పడుతుంది''

''ఎలా?''

''మైకు గోల ఆగిపోయింది. నాకు నిద్దరొస్తోంది. మహ పత్రివతవుకదా?

నేను నిద్రపోతే నీకూ నిద్దరొచ్చేస్తుంది'' ఎగతాళి.

ఒక్కొక్కప్పుడాయన ఎంత మొండికెయ్యగలరో అనుభవపూర్వకంగా తెలుసుకున్న అవంతి ఇంకేమీ మాట్లాడలేదు. నిద్రకు ప్రయత్నం చేసుకోసాగింది.

◇ ◆ ◇

ఊరించి ఊరించి ఎట్టకేలకు వొచ్చింది ఆ ఎల్లుండే. రావలసిన రోజు, ఎదురుచూసిన రోజు. సాయంత్రంకోసం కాబోలు ఉదయంనుంచీ హడావిడే. తెల్లవారుతుండగా కొడుకూ, కోడలూ విశాఖపట్నంనుంచి కూతురూ, అల్లుడూ శ్రీకాకుళంనుంచి దిగారు ఒక్కసారే. వాళ్లని చూసి అవంతికి ఆనందమూ అయింది, ఆశ్చర్యమూ అయింది. వాళ్లని ఇంట్లోకి అడుగుపెట్టనివ్వకుండా వీధిగేటుదగ్గరే వారు మంతనాలు! అప్పుడే వొదిలారు వారు. వీళ్లని ఎందుకొచ్చారో సూటిగా కాకుండా... మాటలలో పెట్టి తెలుసుకుందామని ప్రయత్నిస్తే — ''నీ పుట్టినరోజుకదాని వచ్చాం'' అని తేల్చారు.

సిగ్గేసింది. తనేమైనా బాలా, పాపా నలుగురినీ పిలిచి తగుదునమ్మా అని పుట్టినోజు చేసుకుందుకు? తనకొచ్చినేళ్లెవరికొచ్చాయి? నేడో రేపో రుషిపంచమి నోము చేసుకోవలసిన వయసు. కాటికి కాళ్లుచాచబోయే వయసులో కళ్యాణోత్సవాలూ, జన్మదినాలూనా! నలుగురూ నవ్విపోరూ? వీరిలో — నవ్విపోదురుగాక నాకేటి చేటని మొండికేసి శలగడానికి తానేమీ మగరాజుకాదే? మగనాలే!

తనకే తెలియకుండానే ఇంట్లో ఏదో మార్పు. కోడలు తనని వంటింటివేపు రానివ్వలేదు. తలంటు పోసుకోమని తనే స్నానాల గదిలో అన్నీ సిద్ధం చేసింది! కూతురు కొత్తచీర తెచ్చి అందించింది. విన్నపిందే అయింది భోజనం. మధ్యాహ్నాం నిద్రచేసి... కోడలందించిన కాఫీ, ఫలహారాలు కానిచ్చేసరికి ఇదుగో అదుగో అని ఐదూ!

## పాపం

చేసిన పాపం చెబితే తీరిపోతుందట నిజమేనా సార్'' అడిగాడు నరేంద్ర.

''నిజమేనోయ్. ఇంతకీ ఏం చేశావేమిటి'' అడిగాడు శ్రీనివాసులు.

''నావల్ల మీ అమ్మాయి గర్భవతి అయింది''

''ఆ...''

—శ్రీకాంత (ఎర్రబోడు)



ఇక ఆయన కచ్చీలో కందులు వేసేయడం మొదలుపెట్టారు, "తెములూ తెములూ అంటూ...". ఎక్కడికో చెప్పరు, ఎందుకో చెప్పరు. ఏం దాపరికమో పాడో!

గుడికే అనుకుంది. కాని... రిక్షాలు మరోవేపు. ఇటెక్కడికి చెప్మా?

మీటింగ్ హాలు. సభకు సకల ఏర్పాట్లూ జరిగి సభ్యులతో సహా సిద్ధంగా వుంది. వాళ్లకోసమే ఎదురుచూస్తున్నట్లూ, వాళ్లదే ఆలస్యమన్నట్లూ. మైకు మెల్లగా అరిచింది.

"శ్రీమతి అవంతిగారు — నేటి ముఖ్య అతిథి... వేదికమీదకు విచ్చేయాలి"

తెల్లబోయింది. కాళ్లు వణికాయి. ఆయనేమో ముసిముసి నవ్వులు — ముగ్ధుడిలా. ఎలాగో అడుగులువేసి — వేదికెక్కి — సింహాసనంలాంటి కుర్చీలో కూలబడింది — సభాకంపంతో శరీరం స్వేదమయమౌతుంటే. పైన పంకా బాగానే తిరుగుతోంది. గాలి వీస్తోంది.

"శ్రీ దయానిధిగారిని... అవంతిగారి భర్తను... వేదికపైకి ఆహ్వానిస్తున్నాం"

ఆయన వెళ్లి — ఆమె కుడిపక్క ఖాళీగా వున్న ఆసనంలో. మూడో కుర్చీ లేదక్కడ. సభలో చాలామందే వున్నారు. ముందువరుసలో దయానిధి కొడుకులిద్దరూ... కోడళ్లూ, అమ్మాయి, అల్లుడు సభకు వచ్చిన వారందరూ దంపతులే. కొంతమంది విమెన్స్ లిబ్ సభ్యులున్నారు వారిలో.

"సభను ప్రారంభించవలసిందిగా దయానిధిని కోరుతూ... ముందుగా ఈ సభ ఏర్పాటుచేయబడిన సందర్భం చెబుతాను. శ్రీమతి అవంతిగారికి ఏభై ఎనిమిదేళ్లు నిండినందువల్ల ఏభై తొమ్మిదవ జన్మదినోత్సవం జరుపడానికని శ్రీ దయానిధిగారీ సభను ఏర్పాటుచేశారు. వారు వారి శ్రీమతికీయబోయే అద్భుతమైన బహుమతినిచ్చేందుకే ఈ వేదిక, సభను సాగించవలసిందిగా వారిని ప్రార్థిస్తున్నాను"

శ్రోతలలో గుసగుసలు. ముసలికాలంలో ముచ్చట్లు కాకపోతే అవ్వగారికి జన్మదినమూ, ఆవిడకి కానుకా — అందుకు సభానా! చాలుచాలు. ఏమిటో అనుకుని వచ్చాం. ఇందుకే కుర్రాళ్లు వెక్కిరిస్తారు ముసిలాళ్లకి దసరా పండగని.

వాళ్ల మాటలింకా ఎంతదూరం సాగేవో... కాని... వాళ్ల నోళ్లు మూయడానికే అన్నట్లు ఫలహారాలు అందించబడ్డాయి. లోకుల నోళ్లు మూకుడుతో ముయ్యలేకపోవచ్చుగాని మసాలా మిక్చర్‌తోనూ మన్‌పసంద్ తీపితోనూ మూయవచ్చునని రుజువుచేస్తున్నట్లుగా వారి నోళ్లు మూతపడ్డాయి. తింటూ వినసాగారు.

దయానిధి మైకుముందుకు వచ్చాడు. "అందరికీ వందనాలు. నా పేరు దయానిధి. మీలో చాలామందికి నేను తెలిసినవాడినే. విమెన్స్ లిబ్ సభ్యులనికూడా ఈ సభకు ఆహ్వానించడంలో ప్రత్యేక ఉద్దేశముంది. వ్యర్థంగానూ, అర్థరహితంగానూ అసంబద్ధంగానూ మాట్లాడడం నాకిష్టముండదు. కాని... కొంత వివరంగా చెప్పవలసిన సందర్భమిది. నాగురించికూడా చెప్పుకోక తప్పదు. అది అవసరార్థమే తప్ప ఆత్మస్తుతికి కాదు. ఇప్పుడిక్కడ నేను నా భార్యకివ్వబోతున్న కానుక మీకు ఆశ్చర్యంగానూ, అసాధారణం

గా అనిపిస్తుందని నాకు తెలుసు. కాని... నేను దీనిగురించి మూడేళ్లుగా ఆలోచిస్తూ వస్తున్నాను. నిజం. ఈ సభకు బీజం పడిన — మూడేళ్ల కిందటి ఆ సందర్భం చెప్పక తప్పదు

ఆవేళ ఇంటికి కారు[illegible] మెడలో దండతోనూ వ[illegible]ను కాను[illegible]ట్టుకుని.

"ఏమిటి?" అడిగింది [illegible] — ఆశ్చర్యపోతూ.

"పదవీ విరమణ మహోత్సవం" నవ్వాను మహదానందంగా. నిజంగా నాకు రిటైర్మెంట్ సంతోషంగా వుంది. ఆఫీసుపని దశాబ్దాల తరబడి చేసి చేసి విసుగొచ్చేసింది. [illegible] మార్పు కోరుకుంటోంది మనసు. శ[illegible]మూ విశ్రాంతి కావాలంటూంది. ముందుచూపుతో ఆర్థిక సమస్యలెదురవకుండా చూ[illegible]కున్నాను కనుక ఆ బాధలూ రావు. సంతోషం పట్టలేక — నా మెడలో దండ ఆమె మెడలో వేసి... "రేపటినుంచి ఆఫీసుకి వెళ్లక్కర్లేదు. బండచాకిరీ చెయ్యక్కర్లేదు. బాధలుండవు" అన్నాను. ఆమె కళ్లలో అభినందనలతోపాటు — కించిదసూయకూడా! అసంకల్పితంగానే ఆమె నోటివెంట ఒక నిట్టూర్పు... "అదృష్టవంతులు! మగవారు కదా... ఉద్యోగస్తులుకదా?ఎన్నాళ్లకేనా విశ్రాంతనేదుంటుంది —"

ఆమె అసంకల్పితంగా పలికిన ఆ మాటలలో నాకెన్నో అర్థాలూ భావాలూ గోచరించాయి. మామూలుగా... సందర్భానుగుణంగా అందామె. కాని... అందులో ఎంత ఆవేదన! ఎంత అర్థం! ఎంత ఎత్తిపొడుపు! మరెంత నిరాశ! ఇంకెంత నిస్పృహ!

అప్పటికి చేయగలిగిందేమీ కనిపించక... మౌనం దాల్చాను.

"మీరయితే రిటైరయ్యారని దండ! నాకెందుకూ?" అంటూ తనకు వేసిన దండని మళ్లీ నా మెడలోనే వేసేసింది. ఆ చర్యలోనూ ఆమె మాటలలోనూ నాకెన్నెన్నో స్ఫురించాయి. జరుగుతున్న అన్యాయం అర్థమయింది.

## నూతన ప్రక్రియ



కాన్పుల మధ్య ఎక్కువ ఎడం వుండేట్టు చూసుకోవడానికి బరోడాలోని ఎస్.ఎస్.జి.హాస్పిటల్‌లో పటిష్టమైన ఒక నూతన గర్భ నిరోధక ప్రక్రియ కనిపెట్టారు. ఋతుమతి అయిన ఐదురోజులలోగా ఒక హార్మోన్ల ఇంజెక్షన్ ఇస్తే తర్వాత రెండు నెలలు ఆ స్త్రీకి గర్భం రాదు. రెండేసి నెలలకోసారి అలా ఇంజెక్షన్‌లు తీసుకోవాలి. ఇంజెక్షన్‌లు ఆపిన వెంటనే మామూలుగా ఆమె గర్భవతి అవుతుంది.

—డి.సత్యమూర్తి

"మీరు ఉద్యోగంలోనూ నేను సంసారం లోనూ ఒకేసారి చేరాం. మీరయితే ఆఫీసును ంచి రిటైర్ కాగలిగారు — మగవారుకనుక. కానీ నాకే సంసారంనుంచి వి|శాంతనేది వుండదే! ఆడదానికి సంసారంనుంచి ఒక్క సారి వి|శాంతి విముక్తీ... అది — చావుతో. అంతవరకూ ఇంతే..." అని విసుగ్గా... విరాశగా... విస్పృహగా అంటున్నట్లే ధ్వనిం చింది నామట్టుకు.

నేను మనిషిని.

మగవాడినయినా నాకుహృదయముంది.

దానికి — స్పందన వుంది.

నాకు కొంచెం మెదడుంది. అది ఆలోచి ంచగలదు.

చదివిన |గంథాలనుంచయితేనేం, చూసి న లోకంనుంచయితేనేం — జీవితం గురించి నేను కొంత |గహించడమేకాక — కొన్ని భావాలూ... సిద్ధాంతాలూ కూడా ఏర్పరచు కున్నాను. అవి కొత్తవేమీ కాకపోవచ్చు. కాని — వాటిని నేను బలంగా విశ్వసించడమేకాక — వీలున్నంతవరకూ వాచా మనసా కర్మణా — |తికరణ శుద్ధిగా — ఆచరించదలచుకు న్నానుకూడా. దయచేసి నన్నర్థం చేసుకోండి విసిగిస్తున్నాననుకోక.

సృష్టి సాగింపుకోసమని నరనారులుగా విభజించబడినా |స్త్రీపురుషులిద్దరిదీ ఒకేజాతి — నరజాతి. మానవీ మానవులిరువురకూ కష్టసుఖాలూ, రాగద్వేషాలూ, బాధలూ... భయాలూ... విసుగులూ... ఇద్దరికీ ఒకటే. ఇది నిస్సందేహమూ నిర్ద్వంద్వమూ కదా. మరి — వారి మధ్య అమానుషంగా కొన్నిటి |కూరమైన వ్యత్యాసాలేమిటి? ఇల్లనేదీ ఒక విధంగా కార్యాలయమే. కాకపోతే దీనికి వేళలుండవు. గృహిణే గృహాధికారి. హక్కు లు తక్కువా బాధ్యతలెక్కువా కల ఈ పదవి |స్త్రీ పాలిట ముళ్లకిరీటమే. వొద్దన్నా తప్పదీ కఠినశిలాసింహాసనమామెకి. సంతా నాన్ని కనడంనుంచీ... సకల కార్యాలూ ఆమెవే. అటు భర్తకీ ఇటు సంతానానికీ అన్ని సుఖాలూ అందిస్తూ... సేవలు చేస్తూ... నానా చాకిరీలు చేస్తూ... జవాబుదారీగా వుండవలసిన వ్యక్తి ఆమె. నిజానికి ఆమె పనులు ఆఫీసు పనులకంటె చాలా ఎక్కువ. .. తొందరగానే అలసటా చికాకూ కలిగించే వి. మరి... కనీసం మగవాడిలాగ అయినా ఏభై ఏనిమిదేళ్లకైనా ఆమెకు మా|తం గృహిణి పదవీబాధ్యతలనుంచి విముక్తి, వి|శా ంతి లభించొద్దా? మగవాడికొక న్యాయ మూ మగువకొక న్యాయమూనా? ఏ ధర్మశా|స్త్రం చెప్పింది?"

"భలే! ఆడవాళ్లకూ రిటైర్మెంట్! సమంజసమే. న్యాయమే. ధర్మమే... ద యానిధిగారు మంచి పాయింట్ లేవనెత్తారు . కాని... ఆచరణలో సాధ్యమా?" |శోతల లో సందేహాలు. అవంతి కళ్లనిండా ఆశ్చర్య మే. ఏమిటో ఈయన చాదస్తం?


"చెప్పడానికేం, ఎన్నయినా చెప్పొచ్చు. జరిగే పెట్టే పనులా ఇవి?" ఒకరు. మళ్లీ మాటలు మొదలుపెట్టాడు దయానిధి. "నిష్ఠురమైన నిజం చెబుతున్నందుకు బాధప డకండి. ఈ కాలపు అమ్మాయిలు మంచి భార్యలు కాగలుగుతున్నారేమోకాని మంచి కోడళ్లు మా|తం కాలేకపోతున్నారు సంయు క్త కుటుంబాలలో. కష్టపడడానికెవరూ అంగీ

కరించరు. శ్రమనెవరూ ఆహ్వానించరు. సాధ్యమైనంతా సుఖపడిపోదామనే కోరుకుంటారు. ఇది మానవ మనస్తత్వం. కానీ... ఎదుటి మనిషి మీదకే అంతా తోసేసి చాకిరొకరిది సౌఖ్యమొకరిది అన్నట్లు ప్రవర్తించడం ఎవరికీ న్యాయమూ కాదు, ధర్మమూ కాదుకదా? ఎంత కఠినులై వుండాలి ఎదుటివారే కష్టపడుతుంటే చూస్తూ కూర్చోడానికెవరైనా.

అవంతి కొంత చదువుకున్నదే కాని తన గురించి తానాలోచించుకోదు. ఎదుటివారిని సుఖపెట్టడంలో — తను పడే కష్టమే గుర్తించదు. నాకంటె ఆమె నాలుగేళ్లే చిన్నది. కాని ఎంత శ్రమపడుతుందనీ! ఊళ్లు వెళ్లి మరీ కొడుకూ కోడళ్లకీ, అమ్మాయీ అల్లుడికీ చాకిరీ చేసి వస్తుంది. ఉద్యోగం విరమించి — పనీ పాటలూ లేకుండా కూర్చున్న నాకుకూడా సకల షోడశోపచారాలు చేస్తుంది. ఏ ఇంటయినా ఈవిడదే వంట. ప్రేమా మనుషులూ మారవచ్చునేమోకాని ఈవిడ డ్యూటీ మారదు. చిన్నవాళ్లు — అంటూ కోడళ్లనీ కూతురునీ పనిలోకి రానివ్వదు. పెళ్లంటే నూరేళ్ల వంట స్త్రీ అనే నిజాన్ని నిరూపిస్తుంటుంది. ఎవరింట పురుడూ, పుణ్యం, వ్రతమూ, నోమూ ఏమొచ్చినా ఈవిడకి పిలుపురాకా తప్పదు, ఈమె వెళ్లి వాళ్ల నలగకొట్టుకుని రాకా తప్పదు. చేసే ఆవిడకెలా వుంటుందోకాని — చూసే నాకు మాత్రం మహా బాధగా వుంటుంది. ఎప్పటికప్పుడు — ఇంకానా ఈ అన్యాయం? ఇటుపై ఆపక మానను — అనుకుంటూ తగిన సమయం కోసం ఎదురు చూస్తూ వస్తున్నాను. హృదయం ద్రవించిపోతున్నా ఉగ్గబట్టుకుని. దేనికైనా సమయం రావాలికదా?

ఇప్పుడొచ్చింది.

అవంతికి — ఏభై ఎనిమిది నిండాయి ఇవ్వాళ్టితో. ఆమె ఉద్యోగిని ఐతే ఆఫీసువాళ్లు పదవీ విరమణ సంబరం గావించేవారు. కాని



ఆమె గృహిణి. కనుక మా కుటుంబ సభ్యులే ఆ పండగ చేయాలి. ఇది — ఆమె ఏభై తొమ్మిదవ జన్మదినోత్సవంగా కాక ఇల్లాలన బడే పదవిని విరమిస్తున్న సందర్భంగా జరుగుతున్న సంబరమే. ఇక ఈమెకే బాధ్యతా వుండదు. వంట... ఇల్లు... ఇంటిపనులు... జమా ఖర్చులు... అన్నీ మరొకరు చూసుకోవలసిందే. ఈమె పదవీ విరమణను గుర్తించేవారందరూ ఈమెను అభినందిస్తూ సత్కరించండి — మొదటి దండ నాదే. ఎందుకంటే నేను ఇంటికి బాసుని కనుకా ఇన్నాళ్లూ ఆమె దాసిగానే వుంది కనుకా. నేనీమెను గృహిణి పదవినుం చి విముక్తిరాలిని గావిస్తున్నాను'' అంటూ దండ వేశాడు దయానిధి... అవంతి మెడ లో ''ఈ తరహాలో ఇదే ప్రథమ బహుమతే మో...'' విధిలేనట్లు... ఇద్దరు కోడళ్లూకూ డా ఆవిడను పుష్పగుచ్ఛాలతో సత్కరించా రు. మనసులోమాత్రంఎన్నోఅనుకుంటూ.

ఐతే... ఈవిడ... అత్తగారు... రేపటినుంచి పని ముట్టదన్నమాట! ఊరికే కూర్చుని ఏం చేస్తుందో? గుండ్రాయిలా వుందిప్పటికే. తేరగా తిని కూర్చుంటే మరీ వొళ్లొచ్చేసి బి.పిలూ, సుగరూ అంటూ తమ చేతనే చాకిరీ చేయించుకుంటుందన్నమాట. బాగుంది ఆవిడగారి ఎత్తు. ఈ వయసులో కూడా మొగుణ్ణే కొంగున కట్టుకుని... జాణతనంగా ... తన కోరికనాయనద్వారా బయటపెట్టి తీర్చుకుంటూందన్నమాట! ముంగిలా వుంటుందికానీ ఎంతకయినా తగును... వీళ్ల మనసుల్లో ఇలాటి ప్రణాళిక వుందని తామెవరికీ తెలియనే తెలియదు. ముసిలాయన కూడా — ఆవిడ పుట్టినరోజనీ దండ వేయడమనీ మాత్రమే చెప్పాడు. అత్తగారి నాటలు పట్టించొచ్చనుకుని పరమానందం గా బయలుదేరారు. తీరా చేస్తే — ముసలాళ్లిద్దరూ ఏకమై ఎంత గూడుపుఠానీ చేశారూ? ఎంత ఎత్తు వేశారూ!

అవంతి తెగ సిగ్గుపడిపోతూంది.

వేదికమీద కూర్చుందేకాని — ముళ్లమీదున్నట్టే వుందామెకు.

ఎంతపని చేశారూ వారు! తనేమీ విశ్రాంతినిమ్మని ఆయననెన్నడూ కోరలేదే!

ఆడది... తనకి రిటైర్‌మెంటూ అదేమిటి పేద్ద ఉద్యోగంచేసి పడిపోయినదానిలా?

ఇంటిచాకిరీ వంటా కూడా ఉద్యోగాలేనా? తాను కోరుకోకపోయినా... వారు విశ్రాంతినిచ్చారు! అది ఆయన మంచితనమూ, సంస్కారమూ.

విమెన్స్‌లిబ్ సభ్యురాండ్రలో ఒకరు తమ శాఖ తరఫున అవంతి మెడలో పెద్ద దండవేసి...

''అవంతిగారి అదృష్టాన్ని అభినందిస్తున్నాం మేమందరమూ. స్త్రీకి కూడా రిటైర్మెంటుండి తీరాలి. ఇదే న్యాయం. పాశ్చాత్య దేశాలలో స్త్రీ... గృహిణి చేసే సేవలకు ఖరీదు కట్టబడుతూ ఆమె శ్రమకు రూపాయలలోలాగ విలువ నిర్ణయించబడుతోంది. అంటే... ఆమెకూడా ఉద్యోగినిగా ఆర్జనపరురాలిగా గుర్తించబడిందనే. విసుగనేది పురుషులకే కాదు స్త్రీకీ వుంటుంది. అందుచేత ఆమెకూ విశ్రాంతి కల్పించడం ఎంతో ముదావహం. ఈ ఆలోచన వచ్చినందుకూ, దానిని ఆచరించబోతున్నందుకూ దయాని

ధిగారినెంతో అభినందిస్తున్నాం. ఐతే... ఈ విషయంలో మా సభ్యులకున్న ఒక సందేహాన్ని వారు తీర్చగలరని ఆశిస్తూ — అడుగుతున్నాను.

అదేమిటంటే... దయానిధిగారు మానవత్వంతో అవంతిగారిని తనతో సమానంగా చూసి... ఆమెను గృహిణి పదవినుంచి రిటైర్ చేశారు. కాని... వారి కోడలు యథావిధిగా ఆమెకే అన్ని చాకిరీలు అప్పగిస్తే?'' సందేహాస్పదంగా చూసిందామె.

దయానిధి లేచి జవాబు చెప్పసాగాడు. ''నిజమే... అవంతికి విశ్రాంతినీయడమనేది నేనొక్కడినీ అనుకున్నంత మాత్రాన అయ్యేదికాదు. కోడళ్లుకూడా కలసి రావాలి... సహకరించాలి. సహకరించకపోతే ఎలా అన్న ఆలోచన నాకు రాకపోలేదు. ఆంధ్రదేశమంటే — అత్తాకోడళ్ల ఉప్పూ నిప్పే... అనికదా ప్రాచుర్యం? అందుకే ముందుజాగ్రత్త తీసుకున్నాను. గృహ వాతావరణం అనుకూలంగా లేకపోతే మేమిద్దరమూ ఓల్డేజ్ హోమ్‌కి వెళ్లిపోతాం. అక్కడా మాకిద్దరికీ శేషజీవితం సుఖంగా వెళ్లిపోయేందుకు చాలినంత డబ్బు నేను దాచాను. అక్కడి వాతావరణమూ చూశానొకసారి వెళ్లి. ఫరవాలేదు. కనుక... మేమిరువురమూ నిజమైన విశ్రాంతి జీవితం పొందగలమనే నా విశ్వాసం'' అని ముగించేసరికి — హాలంతా ఒకటే చప్పట్లు.

బయటకు నడుస్తున్న ఆడవాళ్లలో అనేకమంది — తమకూ ఇలాగ ఏభై ఎనిమిదో ఏటకాకపోయినా అరవయ్యో ఏటనయినా తమ భర్త, కుటుంబమూ ఇటువంటి రిటైర్‌మెంట్ బహుమతిగా ఇస్తే బతుకు ఎంత బాగుంటుందీ అనుకుంటూ భారంగా నడుస్తుంటే — విమెన్స్ లిబ్ సభ్యులు మాత్రం ఒకచోట చేరి... ''ఈ ఐడియా బాగుంది. పురుషులతో సమానంగా స్త్రీలకూ పదవీ విరమణ వుండితీరాలి అనే నిదానానికి, ఉద్యమానికీ నాందిపలికితే ఎలా వుంటుందీఅని తర్జనభర్జనలుపడుతుంటే —

అవంతి భుజంచుట్టూ చేయివేసి ఆమెను వేదికనుంచి దిగువకు నడిపిస్తున్న దయానిధి ''ఆఫీసునుంచి నేనూ, ఇంటినుంచి నువ్వూ రిటైరయినా... నీకు భర్తగా నేను, నాకు భార్యగా నువ్వూ మన అందమైన దాంపత్యంనుంచి రిటైరవడమనేది మాత్రం వుండదు సుమా మనం వున్నంతకాలమూ...'' అంటూ చిలిపిగా నవ్వుతున్నారు.

☆ ★ ☆

